**Assembiles of The Living Elohom (1.Tim 3:15) India Presents...............**

Satyamunakai Poratam **REGD. NO. 67970/97**

# సత్యమునకై పోరాటం

Editor & Publisher : **Bro. Isaac E. Kusuma**
**MALIKIPURAM - 533 253**
E.G. Dt. (A.P.) India
Website : www.aotle-india.org
E-mail : info@aotle-india.org
office Ph : **98493 85038**

Regd. Monthly Newspaper
**Postal Regd. No. H/APM/01**
Valid upto 12/2008 Posted on 30th of Every Month
**Annual Subscription Rs. 50/-**

To :

VOLUME : 13 ADAR - 2 - NISAN - ZIF 5769 (March - April 2008) Pages : 4 Issue : 121-122

**హెచ్చరిక :** ఈ పత్రిక ఖండితముగా సత్యాన్వేషుల కొరకు మాత్రమే గాని, క్రైస్తవ మతశాఖల వారి కొరకు కాదు.

# ప్రవక్తల పరిచర్య

పాత నిబంధన కాలంలో పరమతండ్రి మాట చెప్పడం అంటే మరణంతో చెలగాటంలా ఉండేది ప్రవక్తలకు. ఆయన మాట ఉన్నది ఉన్నట్లుగా చెపితే ప్రజలతో బాధ పడాల్సివచ్చేది. చెప్పకపోతే ఆయనతో బాధపడాల్సి ఉండేది. గనుకనే ప్రవక్తలు చావుకైనా తెగించెడివారు గాని, ఆయన మాట చెప్పక ఉండలేకపోయేవారు.

**– యిర్మీయా జీవితాన్ని ఒకసారి పరిశీలిద్దాం !** యిర్మీయా 20 : 7–18 వరకు చదివితే యిర్మీయా బాధ మనకు అర్ధం అవుతుంది. ముఖ్యంగా 9వ వచనం చదవండి. ఆయన మాట ఎలా ఉందో యిర్మీయా అనుభవించి చెప్తున్నాడు.

**– యెహెజ్కేలును పరిశీలిద్దాం !** యెహెజ్కేలు 33:7–9 చూడండి. యెహెజ్కేలుకి ఎలాంటి కష్టాన్ని పరమతండ్రి పెట్టాడో? నీతిగా ఉండే వారిని హెచ్చరిస్తుంటేనే వినరు. ద్వేషం పెంచుకుంటారు. దుర్మార్గులను హెచ్చరిస్తే ఊరుకుంటారా? అయితే యెహెజ్కేలుతో పరమతండ్రి చెపుతూ దుర్మార్గుని హెచ్చరించ మంటున్నాడు. ఒకవేళ యెహెజ్కేలు హెచ్చరించకపోతే అతని ప్రాణానికి ఇతడు ఉత్తరవాది అవుతాడట. ఇది ఎంత కఠినం? అనుభవించేవారికి తెలుస్థాది గాని, పిలుపు లేని బోధకులకు ఇది ఎలా తెలుస్తుంది?

**– బిలాము గాడిదను పరమతండ్రి దూత దర్శిస్తుండగా బిలాము గాడిద పడిన బాధను చూద్దామా!** సంఖ్యా 22:23–30. ఈ గాడిద అడకత్తెరలో పడిన పోకచెక్కలా ఇద్దరి మధ్య అనుభవించిన బాధ దానికే తెలుసు. కదిలితే దెబ్బలు తినాల్సి వస్తుంది. కదలకపోతే దూత ఊరుకోదు. వాస్తవానికి ఈ గాడిద చాలా మంచిదే కాని, బిలాము బుద్దిసరిగాక (సంఖ్యా 22:22) గాడిద బాధలు పడుతూ తన కళ్ళు తెరిపించింది. నా చేతిలో ఖడ్గమున్న యెడల నిన్ను చంపి యందునని బిలాము అంటున్నాడు గాని, వాస్తవానికి బిలాము గాడిద ముమ్మారు దూత యెదుట నుండి తొలగకపోతే యావెదూత బిలామును ఖడ్గముతో చంపియుండెడిది (33వ వచనం). **చంపుతాను అని ఎవరైతే బెదిరిస్తారో వారు చంపబడతారు.** చూడండి బిలాము ఏమయ్యాడో చదువుతారా? అయితే యెహోషువ 13:22 చదవండి.

**సౌలు రాజు ఎప్పుడూ దావీదుపై ఈటె విసురుతూ ఉండేవాడు.** దావీదును చంపాలని చూసెడివాడు. కాని చూడండి అతను ఎలా చనిపోయాడో? 1 సమూ. 31:2–6, 2 సమూ. 1:1–16.

**హామాను మొర్దకై కొరకు ఉరికొయ్య సిద్ధపరిచాడు** కాని బైబిలు చదువుతున్న మనకందరికి తెలుసు ఆ ఉరికొయ్య మీద వానినే ఉరితీసారు (ఎస్తేరు 7:9–10)

**గొల్యాతు నూరిన కత్తికి గొల్యాతే ఆహుతయ్యాడు** (1 సమూ. 17:43–58)

గనుక మన పరమతండ్రియైన యషువ మెస్సీయ చెప్పినట్లు **"కత్తి పట్టుకొను వారందరు కత్తిచేతనే నశింతురు"** మత్తయి 26:52. పరమతండ్రి మాటలు కేవలం దయ, జాలి కలిగినవే కావు, కఠినమైనవి కూడా. అందుకే ప్రవక్తలు బోధించినపుడు యాజకులు, రాజులు, కొన్నికొన్నిసార్లు సహింపలేక పోయేవారు.

ప్రవక్తయైన ఆమోసు ప్రవచించుచున్నప్పుడు బేతేలులోని యాజకుడైన అమజ్యా సహించుకోలేక పోయాడు (ఆమోసు 7:19–17). ఎందుకంటే బేతేలులోని యాజకుడైన అమజ్యా సరియైనవాడుకాడు. యాజకుడుగా ఉన్నాడే తప్ప యావె కార్యమును ఎరుగనివాడు. డమ్మీ యాజకులకు ప్రవక్తల పరిచర్య అర్థం కాదు. అమజ్యా తప్పుడు రూటులో ఉన్న యాజకుడని, అక్షరజ్ఞానమే గాని ఆత్మజ్ఞానం లేనివాడనీ, యావె చిత్తం ఎరుగనివాడని ప్రవక్తయైన ఆమోసుకు తెలుసు. ఇలాంటి డమ్మీ యాజకుల వలన సత్యము బయలుపడదు గాని, ఆచారము, సాతాను చిత్తము యావె నామములో జరుగుతూ ఉంటాది. ప్రజలు కూడా దీనిని గ్రహించాలి. ప్రజలకు కూడా పరిశుద్ధాత్మ ఉంటేనే ప్రవక్త అర్థం కాగలడు. లేకపోతే ప్రజలు, డమ్మీ యాజకులు హర్ట్ అవుతూనే ఉంటారు. అందుకే అమజ్యా అంటున్నాడు. ఆమోసు మాటలు దేశము సహింపజాలదు అని (ఆమోసు 7:10). అవి ఆమోసు మాటలు కాదు.పరమతండ్రి ఆమోసు ద్వారా పలికిస్తున్న మాటలు అని అమజ్యా తెలుసుకోలేకపోతున్నాడు.

**పరమతండ్రియైన యావె మాటలు ఎలా ఉంటాయో చూద్దామా !**

1. అగ్నితో కాల్చినట్లు ఉంటాయి ........................................ యిర్మీయా 5:14, 23–29.
2. సహింపజాలనట్లు ఉంటాయి ................................................................ ఆమోసు 7:11
3. వినవొల్లనివాటిగాను, బాధ కలిగించేవిగాను ఉంటాయి....................... యిర్మీయా 18:18
4. కఠినమైన మాటలు చెప్పమని ప్రవక్తకు ఆజ్ఞ.................................. 1 రాజులు 14:6
5. బండను బద్దలుచేయు సుత్తి వంటివి ................................................. యిర్మీయా 23:29
6. తిరుగుబాటుదారులకు యావె మాటలు అడ్డంగా ఉంటాయి........................ హోషేయ 14:9
7. విమర్శలా ఉంటాయి ............................................ యిర్మీయా 6:15, 1 కొరింథి 14:24
8. హృదయంలో మంట పుట్టిస్తాయి............................................................ లూకా 24:32
9. కఠినమైనవి గనుక వినలేరు ......................................................... యోహాను 6:60
10. బిగగొట్టబడిన మేకుల్లాంటివి.............................................................. ప్రసంగి 12:11
11. గండ్రగొడ్డలి దెబ్బలా ఉంటాయి.................................... యిర్మీయా 51:20–23
12. అధికారంతో నిండి ఉండే మాటలు ............................................... మత్తయి 7:29
13. ధైర్యముతో నిండి ఉంటాయి ............................................ అ.కార్య 4:13, 26:26
14. దృఢముగా ఉంటాయి ........................................................... అ.కార్య. 18:5
15. సింహగర్జనలా ఉంటాయి ................................................................ అమోసు 3:8
16. వధించి బద్దలుగొట్టేలా ఉంటాయి............................................... హోషేయ 6:5
17. నిందించినట్లుగా ఉంటాయి................................................................ లూకా 11:45
18. హృదయం నొచ్చుకొనేలా ఉంటాయి............................................. అ.కార్య. 2:37
19. హృదయాన్ని నరికినట్లుగా ఉంటాయి.................................................. అ.కార్య 5:33
20. మనసాక్షి చేత గద్దించబడేలా ఉంటాయి..................................... యోహాను 8:9
21. కత్తిపోటు వంటివి ............................................................ న్యాయాధి 3:20,21

అందుకే ప్రవక్తలను చంపేసేవారు. ప్రవక్తల దగ్గరకు వెళ్ళేవారు కాదు. ప్రాణానికి భయపడిన ప్రవక్తలు కూడా "యావె మాటలు" ఎవరికి అందించాలో వారికి అందించేసి పారిపోయేవారు. యిర్మీయా 26:20–21, యిర్మీయా, మీకా ప్రవచించినట్లే ఊరియాయు ప్రకటించి ప్రాణాన్కి భయపడి పారిపోయాడు. ఏలీయా కూడా ప్రాణభయంతోనే పారిపోయాడు. 1. రాజులు 19:2–4.

ఒకరాజు చేస్తున్న పొరపాటును/తప్పును ప్రవక్త ఎత్తి చూపిస్తూ నీవు ఎందుకు ఇలాంటి పనులు చేస్తున్నావు? అని అడిగినందుకు, రాజు – **"నీవు రాజుయొక్క ఆలోచనకర్తలలో ఒకడివైతివా? ఊరకొనుము, నేను నిన్ను చంపనేల"** అని అన్నాడు. 2. దిన 25:16.. అప్పుడు ఆ ప్రవక్త మనసులో ఏమి అనుకున్నాడు అనేది మీరే చదవాలి. 2. దిన 25:16బి. ఈ రాజులాంటి నీచమైన మనుష్యులు ఉన్నారు గనుకనే కొన్ని కొన్నిసార్లు పరమతండ్రి ప్రవక్తల నోర్లు మూసివేసేవాడు యెహేజ్కేలు 3:24–26, ప్రవక్తల దగ్గర వర్తమానం ఉండికూడా ప్రాణాన్కి జడిసి చెప్పేవారు కాదు యిర్మీయా 38:14–25, నిజం చెపితే అసహ్యించు కుంటున్నారని తెలుసుకొనే ప్రవక్తలు అబద్దాలు చెప్పేవారు 1. రాజులు 22:8,15, అబద్దాలనే నమ్మే ప్రజలను పరమతండ్రే వారి మీదికి అబద్ధపుఆత్మను పంపి మోసం చేస్తున్నాడు. 1. రాజులు 22:23, 2. థెస్స 2:11,12. నాలుక హానికరమైన మాటలు పలుకుచుండగా అబద్దికుడు చెవి యొగ్గును. (సామెతలు 17:4) హానికరమైన మాటలు వినడాన్కి మనం సిద్దపడినపుడు హానికరమైన బోధకులనే పరమతండ్రి మనకు ఏర్పాటు చేస్తాడు. అందుకే నిజమైన ప్రవక్తల దగ్గరకు వేషదారులు ఎవరైనా వస్తే, నా దగ్గరకు ఎందుకు వస్తున్నారు మీ తలిదండ్రులుంచుకున్న ప్రవక్తల దగ్గరకు పొండి (2. రాజులు 2:13) అనేవారు. ఈ రోజుల్లో కూడా ఇదే ఉంది. వ్యక్తిపూజకు అలవాటు పడిపోయారు. వాక్యానికి ప్రాముఖ్యత యివ్వరు గాని వ్యక్తులకు ప్రాముఖ్యత ఇస్తున్నారు గనుకనే వారికి అనుకూలమైన బోధకులను (2.తిమోతి 4:3,4) ప్రోగుచేసుకుని వారు చెప్పిందే నమ్ముతూ వారు వాస్తవంగా బోధకులు కాకపోయినా వారినే వెంబడిస్తూ గ్రూపులు తయారు చేసుకుంటున్నారు.

పెంతెకోస్తు పండుగ ఎప్పుడూ సీవాన్ 6 నే వస్తాది అని నమ్మిన ఒకతను నాకు ఫోన్‌చేసి, బ్రదర్, మీరు వ్రాసిన **"పెంతెకోస్తు పండుగ దినమును లెక్కించుట ఎట్లు?"** అనేది తప్పు అన్నాడు. కాదు. నీవే తప్పు అని నేను అన్నాను. ఏ ఎందుకని? అని చాలా రేష్‌గా మాట్లాడాడు. "నీకు నిజంగా ఆత్మజ్ఞానం ఉంటే ఒక చిన్న పాయింట్‌ని బట్టి అర్థం చేసుకోగలవు" అని చెప్పి ఒకేమాట చెప్పాను. బైబిల్లో పరమతండ్రి అన్ని పండుగలకు తేదీలు చెప్పాడు గాని పెంతెకోస్తు పండుగను మాత్రం లెక్కించాలి అని చెప్పాడు. లేకపోతే అన్ని పండుగలకు తేదీలు యిచ్చినట్లే పెంతెకోస్తు పండుగకు కూడా తేదీ యిచ్చిఉండేవాడు. గనుక సీవాను 6 తప్పు అన్నాను.

| | |
|---|---|
| 1. పస్కా పండుగ | నీసాను 14వ తేదీ |
| 2. పులియని రొట్టెల పండుగ | నీసాను 15–21 వ తేదీలు |
| 3. పెంతెకోస్తు పండుగ | |
| 4. జ్ఞాపకార్ధ శృంగాధ్వని పండుగ | ఏతనీమ్ 1వ తేదీ |
| 5. పాప ప్రాయిశ్చిత్తార్ధ దినము | ఏతనీమ్ 10వ తేదీ |
| 6. పర్ణశాల పండుగ | ఏతనీమ్ 15–21 |
| 7. అంత్యమహాదినము | ఏతనీమ్ 22వ తేదీ |

అయినా పెంతెకోస్తు పండుగ ఎప్పుడూ సీవాన్ 6వ తేదీన మాత్రమే రాదు. సీవాన్ 7న కూడా వస్తుంది. దయతో ఈ బోర్డు పరిశీలించండి!

| | | |
|---|---|---|
| 2005 | సీవాను 6 | జూన్ 13 సోమవారం |
| 2006 | సీవాన్ 7 | జూన్ 3 శనివారం |
| 2007 | సీవాన్ 6 | మే 23 బుధవారం |
| 2008 | సీవాన్ 6/7 | జూన్ 10/11 మంగళ/బుధ |
| **2009** | **సీవాన్ 6** | **మే 31 ఆదివారం** |
| 2010 | సీవాన్ 6 | మే 20 గురువారం |
| 2011 | సీవాన్ 6 | జూన్ 8 బుధవారం |
| **2012** | **సీవాన్ 6** | **మే 27 ఆదివారం** |
| 2013 | సీవాన్ 6 | మే 16 గురువారం |
| 2014 | సీవాన్ 6 | జూన్ 4 బుధవారం |
| 2015 | సీవాన్ 7 | మే 25 సోమవారం |

అటులనే బైబిల్లో లేని **యాషేరు గ్రంథం 82:6 ప్రకారం సీవాన్ 6న పెంతెకోస్తు పండుగ వచ్చినది అని చేప్పే మీరు నిర్గమ 19 అధ్యాయం చదివితే తెలుస్తుంది.** అది ఎంతవరకు నిజమో అనేది ఒక వేళ సీవాన్ 6న పెంతెకోస్తు పండుగ అని మీరు **యాషేరు గ్రంథం 82:6 ప్రకారం భ్రమించినా,** పై పట్టికలో **2009, 2012** సం॥లలో సీవాన్ 6 ఆదివారం వచ్చింది గనుక అక్కడ కూడా మీరు కరెక్టుకాదని ఋజువు అవుతుంది. గనుక మీ సోదె తెలివితేటలు సాతాను ప్రయోగాలు మా మీద ప్రయోగించకండి.

అమెరికాలో చాలాపెద్ద భక్తుడు చెప్పాడు అన్నాడు. అది నాకు తెలియదు బ్రదర్, నాకు వాక్యము ఏమి చెప్తుందో అది కావాలి తప్ప, భక్తులతో నాకు సంబంధం లేదు అన్నాను. నీవు అమెరికాలో భక్తుడు అన్నావు గనుక చెప్తున్నాను విను. నీవు చెప్పిన అమెరికాలోనే వేరొక పెద్ద భక్తుడు నాకు తెలుసు. అతను కూడా పెంతెకొస్తు పండుగను ఆదివారం రోజున చేసే వారిని విమర్శించి పత్రికలు వ్రాసేవాడు. అక్కడికి ఆయనే గ్లోబుమీద ఏకైక భక్తుడున్నట్లు (రైట్ అన్నట్లు) ఇతరులను విమర్శించి వ్రాసేవాడు. కొంతకాలం పోయాక తను, తన సహోదరుడు **"హనోకు – ఏలియాలు"** అని ప్రకటించాడు. తర్వాత తన సహోదరుడు చనిపోయాడు. పరిశుద్ధ నామము గ్రూపులన్నీ అతడ్ని ఒక **"అబద్ధ ప్రవక్త"**గా ముద్రవేసి ప్రక్కకు నెట్టేసారు. అతను ఎన్నో ప్రవచనాలు ఆయా కాలములలో జరుగుతాయని ప్రవచించి వ్రాసాడు. అవి ఏమీ జరగలేదు. ఆయనకి ఒక పెద్ద సంస్థ ఉంది. తను స్వంతంగా బైబిలును ప్రింట్ చేసుకొని తన సామ్రాజ్యాన్కి అధిపతి అయ్యాడు. కాని ఫెయిల్ అయ్యిపోయాడు. ఈ వచనాలు ఒకసారి చదువు. అ॥కార్య 5:35-39, గనుక ఎవరి మతికి తోచినది వారు చేస్తున్నారు. ఇప్పుడంతా ఎవరి ఇష్టం వాళ్ళది (న్యాయాధి 21:25) **పరమతండ్రి ఇష్టం నెరవేర్చే వాళ్ళ రూటు వేరేగా ఉంటుంది. వాళ్ళు వాక్యానికి తప్ప భక్తులకు, వ్యక్తులకు ప్రాముఖ్యత నివ్వరు, వారు మోమాటం ముఖస్తుతి చేసేవారిగా ఉండరు.**

బైబిలులో అహీతోపెలు అనే ఒకతను ఉన్నాడు. చాలా పవర్‌ఫుల్ వ్యక్తి (2. సమూ 16:23). అతను ఆలోచన చెప్పాడంటే పరమతండ్రి యొద్ద విచారణ చేసి చెప్పినట్లే ఉంటాది. దావీదుకు, తన కుమారుడైన అబ్షాలోముకు కూడా అతడంటే చాలా నమ్మకం. **అయితే అహీతోపెలు చేసిన పొరపాటు ఏమంటే..... దావీదు విషయంలో పరమతండ్రి చిత్తం ఏమిటో తెల్సుకోకుండా, అబ్షాలోము కుట్రలో పాలిభాగస్తుడయ్యాడు (2, సమూ 15:30,31)** అబ్షాలోముకు తప్పుడు ఆలోచన చెప్పాడు (2. సమూ 17:1-4) ఈ ఆలోచన అబ్షాలోముకు, ఇశ్రాయేలీయుల పెద్దలందరికీ చాలా బాగా నచ్చేసింది. కాని అక్కడ ఇంకొక పరమతండ్రి బిడ్డ ఉన్నాడు. అతనే హూషై (2.సమూ 17:5) **"ఈసారి అహీతోపెలు చెప్పిన ఆలోచన మంచిది కాదు"** అని చెప్పాడు. ఇదే రీతిగా అహీతోపెలు లాంటి మంచి సేవకులు, కొన్నికొన్నిసార్లు స్వార్ధబుద్ధితో, కుట్ర ఆలోచనలు కలిగి (2.సమూ 15:31) ఆత్మ సంబంధులపై తప్పుడు ఆలోచనలు చెపుతూ ఉంటారు. కొన్ని విషయాలలో మంచిగా బోధిస్తూ, మరికొన్ని చెడు బోధిస్తుంటారు. వివేకములేని ఇశ్రాయేలీయులు, వారి పెద్దలు, వారి నాయకుడైన అబ్షాలోము మొ..గు వారికి అవి చాలా బాగా నచ్చాయి. కాని అబ్షాలోము ఎలా చనిపోయాడో (2.సమూ18:14,15) అహీతోపెలు ఎలా చనిపోయాడో (2.సమూ17:23) మనం చదివాము. సమాజములు విడగొట్టడాన్కి అహీతోపెలు లాంటివారు ఆలోచనలు చెపుతూ ఉంటే దానికి విశ్వాసులు, పెద్దలు ఆజ్యం పోస్తూ ఉంటారు. పరమతండ్రి చిత్తం ఎరుగక, అబ్షాలోము తండ్రి రాజ్యామునే దోచెయ్యాలని ప్రయత్నించాడు. ఒకర్ని పడగొట్టి ఒకరు రాజ్యం చెయ్యాలని ఆలోచించడం ఎంత తప్పో తెల్సుకునే లోగానే ప్రాణాలు పోగొట్టుకున్నారు.

**సహోదరులు కలిసి ఉండాలని లేఖములు (కీర్త 133-1) బోధిస్తుంటే, గ్రూపులుగా విడగొట్టడం (1.కొరింధీ 1:11-13) శరీరసంబంధులు చేసేపని. విడిపోవాలి అంటే ఏదో నెపం చూపించాలి గనుకనే ఏదో విషయంలో వాదం పెట్టుకోవాలి (అ॥కార్య 15:36-39) అప్పుడు ఇలా విడిపోవచ్చు. అప్పుడు ఒకరిమీద ఒకరు నేరారోపణలు చేసుకోవచ్చు కనిపించినపుడు మాత్రం షలోం బ్రదర్ / షలోం అన్నా అని పెదవులతో సరిపెట్టుకోవచ్చు. ఇది నేటి పరిశుద్ధ నామములుచ్చరించే బోధకుల స్తితి.**

అపోస్తులుడైన సౌలు, కేఫాను (గలతీ 2:11-15) ముఖాముఖిగా ఎదిరించి ఖండించాడు. అయితే కేఫా విడిపోలేదు గాని సౌలును ఎంతో హెచ్చిస్తూ తన పత్రికలలో వ్రాసాడు (2. పేతురు 3:15:16). సౌలుయొక్క జ్ఞానాన్ని కొనియాడాడు. అంతేగాని సౌలు విషయంలో సణుక్కుంటూ, ప్రతిచోట సహోదరులకు సౌలుపై చెడు చెప్పుకుంటూ తిరగలేదు. అది ఆత్మసంబంధుల లక్షణం. బర్నబా పరిశుద్ధాత్మతోను, విశ్వాసముతోను నిండుకొనిన సత్పురుషుడు అని అ॥కార్య 11:24లో పరిశుద్ధాత్మ వ్రాసినను, యూదుల మాయవేషమునకు బార్నబా కూడా మోసపోయాడని గలతీ 2:3లో అదే పరిశుద్ధాత్మ తెలియపరుస్తుంది.

పరిశుద్ధాత్మ ద్వారా ఒక ప్రత్యేకమైన పనికి సౌలుతో నియమింపబడిన బర్నబా (అ॥కార్య 13:2,3) అపోస్తలుడైన సౌలుతో ముఖ్యప్రసంగీకుడుగా పేరుగాంచిన బర్నబా (అ॥కార్య 15:2,12). కేవలం మార్కు అను పేరుగల యోహాను విషయంలో సౌలుతో వేరయ్యి (అ॥కార్య 15:36-39) మార్కును తీసుకొని కుప్రకు వెళ్ళాడు. ఆ తరువాత నుండి అతని పరిచర్య బైబిలు గ్రంథములో వ్రాయబడలేదు.

**పరమతండ్రి చిత్తంకన్నా మనుష్యుల ఆలోచనలే ముఖ్యం అనుకునే వారే ముందుగా వేరయ్యి పోవడాన్కి సిద్ధపడతారు. బైబిలు క్యాలండర్లు తయారు చేయడం, నెల పొడుపుదినాలు ప్రకటించడం, పత్రికలు వ్రాయడం అనునది ఎలోహీం పిలుపు ఉన్నవారు చేయవలసిన పనులు. ఇవి అందరూ లేక ఎవరుబడితే వారు చేయకూడదు.** కాని చేస్తూఉంటారు. ఎందుకంటే నిజమైనవారు అబద్దికులు కలిసే ఉన్నారు గనుక.. గోధుమలు – గురుగులు ఒకే పొలంలో ఎదుగుతున్నాయి గనుక. వాటిని ఇప్పుడు మనం పెరకడం కష్టం. కాని ఏది గోధుమగింజ – ఏది గురుగుగింజ అనేది మాత్రం మనం తప్పక కనిపెట్టాలి.

పరమతండ్రి సేవకులు సబ్బాతుపై పత్రికలు వ్రాస్తూఉంటే, సబ్బాతుకు వ్యతిరేకంగా పత్రికలు వ్రాసేవారు ఉన్నారు. వారు కూడా దేవునిసేవ చేస్తున్నామనే, దేవునిచే పిలవబడినవారనే చేస్తున్నారు. **ఆఖరికి మనలను చంపుతాము, నరుకుతాము అనేవారు కూడా పరమతండ్రికి సేవచేస్తున్నామనే భ్రమలోనే అలా అంటున్నారని వాక్యం సెలవిస్తుంది. మిమ్మును చంపు ప్రతివాడు తాను ఎలోహీంకి సేవ చేయుచున్నానని అనుకొనుకాలము వచ్చుచున్నది. యోహాను 16:2. అందుకే చంపుతాము. పొడుస్తాము అని బెదిరిస్తారు.**

ఏది ఎవరు చెయ్యాలో వారు చేస్తేనే అది క్రమము అవుతుంది. కాని అక్రమస్తులు చొరబడ్డారు గనుక క్రమమునకు ఆటంకం కలుగుతుంది. యావె పిలుపు లేకుండా సువార్తకు వచ్చిన / వచ్చుచున్న వారి వలనే ఈ ఇబ్బందులు ఎదురవ్వుచున్నవి, గలతీ 6:3. వాస్తవానికి వీరు ఎన్నికలేని వారైనప్పటికీ ఎన్నికైన వారుగా ఫుల్‌ఫిట్ ఎక్కడం వలన, వాక్యము బోధించుచున్నందున ఈ శోధనలు మనకు వస్తున్నవి.

పరమతండ్రి యొక్క సమాజమును నడిపించడాన్కి ఆయన కొందరిని అపోస్తలులనుగాను, కొందరిని ప్రవక్తలనుగాను, కొందరిని సువార్తికులనుగాను, కొందరిని కాపరులగాను, ఉపదేశకులుగాను, ఏర్పాటు చేసుకున్నాడు ఎఫెస్సీ **4:13., వారు మాత్రమే మెస్సీయ సమాజమును నడిపించాలి. ఎవరుబడితే వారు ఫుల్‌ఫిట్ ఎక్కకూడాదు, వాక్యమును బోధించకూడదు.**

**ముస్లిం సోదరులను చూడండి.** వారి మసీదులలోని బోధకులను చూడండి. ఆ పనికి నిర్ణయించ బడిన వారుతప్ప, మిగతా వారెవ్వరూ ఖురాన్ బోధించరు. ఖురాన్ అందరూ చదువుకుంటారే గాని బోధించడాన్కి సాహసించరు. వెళ్ళరు. అది కేవలం ముల్లాలు (బోధకులు) మాత్రమే చేస్తారు. **అటులనే హిందూ పూజారులను చూడండి.** ఆ పనికి నిర్ణయించబడినవారు తప్ప మిగతా వారెవ్వరూ ఆ స్థలమునకు వెళ్ళసాహసించరు. ఎటొచ్చీ ఏ భయము లేకుండగా ప్రతీవారు సాహసించి, ఆ పనికి వారు నిర్ణయించ బడనప్పటికీ తిరుగుబాటు చేస్తున్నది క్రైస్తవులు మాత్రమే. ఆఖరికి నేడు స్త్రీలు కూడా ఫుల్‌పిట్ ఎక్కి బోధలు చేస్తున్నారు. చాలా అక్రమము చోటుచేసుకుంది గనుకనే ఇన్ని మిషనులు, ఇన్ని గ్రూపులు, ఇన్ని భేధాభిప్రాయములు. గనుక పరమతండ్రిచే ఏర్పాటు చేయబడని బోధకులు విషయంలో సత్యాన్వేషులు జాగ్రత్త వహించాలి. వ్యక్తిపూజలు, వ్యక్తులపై అభిమానం పరమతండ్రి బిడ్డలకు తగదు.

మా ఏరియాలో ఒక లెక్చరర్, ఒక హైస్కూల్ పంతులు తరచుగా బోధకుల్లా చలామణీ అవుతూ పాంప్లెట్స్ మీద వారి పేర్లు వెయ్యించుకుంటూ ప్రచారం కొనసాగిస్తూ ఉండేవారు. పాస్టర్లు చాలామంది ఎందో బాధపడుతూ ఉండేవారు. కాని ఎవరూ వాళ్ళని ముఖాముఖిగా ఎదిరించడం గాని లేక అడగడం గాని చేసేవారుకారు. కొంతకాలాన్ని వీళ్ళ పరిస్థితి ఎంతవరకూ వచ్చిందంటే, పాస్టర్లనే విమర్శించే స్తితికి దిగజారిపోయారు. వాళ్ళు (పాస్టర్లు) ఏదో డబ్బుకోసం చేస్తూన్నట్లు వీరు ఏదో ఉచితంగా సువార్త ప్రకటిస్తున్నట్లు నటించడం మొదలెట్టారు. ఒకరోజు వారిని నేనడిగాను బ్రదర్స్ మీరు ఉద్యోగం కూడా ఉచితంగా చెయ్యొచ్చుగదా! జీతమెందుకు తీసుకుంటున్నారు? అని అడిగితే.. నోరు ఎత్తక మౌనం వహించారు. ఉద్యోగం చేసేవాడు ఉద్యోగం వలన బ్రతకాలి. గనుక జీతం తీసుకుంటున్నాడు. మరి సువార్త చేసేవాడు ఎలా బ్రతకాలి అని బైబిలు చెప్తుంది? 1. కొరింధీ 9:1-14, చదవమని అడిగి, తమరు దశమ భాగములు ఇస్తున్నారా? తమరు ఏ సంఘ సభ్యులు? తమరి సహవాసం ఎక్కడ? తమ పాస్టర్‌గారు ఎవరు? అని అడిగితే.... అసలు మాట రావడమే లేదు.

కొంతసేపయ్యాక, మా దశమ భాగములు సువార్తసేవకి ఖర్చుపెడుతున్నాం అన్నారు. అలాగని బైబిలు చెప్తుందా? అని అడిగితే... దశమభాగము ఎవరి సొమ్ము? అది ఎక్కడ ఎవరికి చెందాలి? అని అడిగితే..... దానికి సమాధానం లేదు. ఏం బాబు! మీకు నిజంగా అంత సువార్త భారం ఉంటే ఉద్యోగం వదిలి రండి. అని అడిగితే... ఇంకేముంది? ద్వేషం పెంచుకుని ..... చెడు ప్రచారం మొదలుపెట్టారు., **మీరు సత్యమైన మాట కరెక్టుగా చెప్పారనుకోండి, పరిస్థితి ఎలాగుంటాదో తెలుసాండీ? మెస్సీయ రొట్టెముక్కముంచి ఇస్కరియోతు యూదాకి యివ్వగానే... అతనిలో సాతాను ఎలా ప్రవేశించిందో అలా ఉంటుంది. గనుక పరమతండ్రి మాట చెప్పడం అంటే అంత తేలికైన విషయం కాదు.**

అందుకనే అనేకమంది బోధకులకు నిజం తెలిసినా, చెప్పకుండా, అక్రమం జరుగుతున్నా ఖండించకుండా, కళ్ళతో చూసినా చూడలేనట్లుగా, అబద్ధం అని తెలిసినా మాట్లాడకుండా, మాకెందుకులే దేవుడే చూసుకుంటాడు (యోబు 32:13) అని అనుకుంటూ వెళ్ళిపోతున్నారు.

అందువలననే వారు, దేవుని వాక్యము అద్దం లాంటిది. తేనెవంటిది. నూనెవంటిది, దీపం వంటిది, విత్తనం వంటిది, పాలవంటిది, అంటూ ప్రజలకు మెత్తని బోధలు అలవాటు చేసి దేవుడు ప్రేమామయుడు, కరుణామయుడు దయామయుడు, మొదలగు చల్లని మాటలు వల్లిస్తూ ఏ సమస్యలు లేకుండా చక్కగా జీవించగలుగుతున్నారు. ఏ సంఘానికి ఏ బోధ చెయ్యాలి, ఏ బోధకుడికి ఎలా నమస్కారం చెప్పాలి. ఎవరితో ఎలా మాట్లాడితే పైసలు జేబులోకి వస్తాయి అని ముందుగానే ఆలోచించుకుని ప్రసంగాలు చేస్తున్నారు. గనుక అందరినీ సంతోషపరచగలుగుతున్నారు. మనుష్యుల మనీ, మన్ననలు పొందగలుగు చున్నారు.

10 సంవత్సరాల క్రిందట నేనొక బోధకుడ్ని అభిషేకించాను. కొంతకాలమయ్యాక ఎలా ఉంది మీ సేవ? ఏమిటి సంగతులు అని అడిగాను. ఏముంది సార్, ఒక్క విశ్వాసి కూడా దశమభాగం యివ్వడం లేదు. పైగా అందరూ నన్ను ఏమి తెలియనివాడిగా చూస్తున్నారు. నన్ను అడ్డుపెట్టుకొని (డమ్మిగా ఉంచి) వాళ్ల పనులు వాళ్ళు చేసుకుంటున్నారు. పేరుకిమాత్రమే నేను యాజకుడ్ని గాని అధికారమంతా మా సంఘస్తులదే అన్నాడు. చూడు సహోదరుడా! తప్పు వాళ్ళది కాదు. నీది అన్నాను. పరమతండ్రి నీకంటూ ఒక స్థానమిచ్చాడు. దానిని నిలబెట్టుకోవలసింది నీవు. **నీవు చెప్పితే విశ్వాసులు వినాలి గాని, విశ్వాసులు చెప్పితే నీవు చేయడం తప్పు. నీ బలహీనత వాళ్ళకి బలం. వాక్యోపదేశం నీవు చేయడం మానేస్తే వాళ్లు నీకు చేస్తారు. ఎవర్ని ఎక్కడ పెట్టాలో అక్కడ పెట్టకపోవడం నీవు చేసిన/చేస్తున్న తప్పు. యాజకత్వం (మోరీమ్) అంటే చిన్న విషయం కాదు. ప్రతీ పనికిమాలిన వ్యక్తినీ ఫుల్‌ఫిట్ ఎక్కనివ్వకూడదు.** అది అధికారంతో కూడిన ఎలోహీం పని. నీవు సాధారణమైన మనుష్యులచేత ఏర్పాటు చేయబడినదూడ యాజకుడవా? (1. రాజుల 12:31) లేక పరమతండ్రి రాజ్యమునకు సంబంధించిన యాజకుడవా? అని తిట్టి అతని స్థానమేమిటో అతనికి వివరించాను. పరమతండ్రికోసం కాకుండా, పేరు మాత్రం పరమతండ్రికే అంటూ స్వంతంగా సంఘాలు కట్టి, వాళ్ల అధికారమే చెలాయించుకునే ప్రబుద్ధులు చాలామంది ఉన్నారు. చదవండి 1. రాజులు 12:26-33. వీళ్ళు సంఘాలు కడతారు. అందులో లేవీయులు (నిజమైన యాజకులు) కాని వారిని, సాధారణమైన వారిని యాజకులుగా నిర్ణయిస్తారు. వాళ్లచేతనే వాళ్ళ సంఘాలలో బోధలు చేయిస్తూ ఉంటారు. వాళ్ళేమో **వాక్యోపదేశకులుగా** ఫుల్‌ఫిట్‌లు ఎక్కేస్తూ ఉంటారు. పరమతండ్రి అట్టివారిని సహించడు. క్షమించడు. ఒకానొక సమయంలో పరమతండ్రి వీరిని శిక్షించక మానడు.

ఒక ప్రవక్త దగ్గరకు ఒకతను వచ్చి బ్రదర్, నేను సేవ చెయ్యాలనుకుంటున్నాను అని అన్నాడట. సేవకునికి ఉండవలసిన అర్హతలు, లక్షణాలు నీలోలేవు గనుక నీవు పనికిరావు అని చెప్పాడట (1.సమూ 16:6-10). అతడు చాలా కోపోద్రేకుడై ఆయనను చాలా అల్లరి చేసాడట. ఆఖరికి ఒక వ్యక్తిని అభిషేకించమన్నాడట. అతను అభిషేకించాడుట. అభిషేకించబడిన అతనిని డమ్మిగా ఉంచుతూ వాడుతూ (బాప్తిస్మములకు, రొట్టే, ద్రాక్షరసం యివ్వడానికి మాత్రమే) మిగతా పని అంతా ఈయన చేసేస్తున్నాడట. దశమభాగములు, కానుకలు, అర్పణలు అన్నీ ఈయనగారే స్వాహా చేసేస్తున్నాడట. ఈయనగారు సంఘాలు కడుతున్నాడట. కాని ఆ ప్రవక్తకి తెలుసు: అతను దెబ్బతింటాడని. అది అతనికి చెప్తే అతను వినడట. ఎందుకో మీకు తెలుసా? అతను ఎందుకు ప్రవక్తమాట వినడో మీకు తెలుసా? ఆత్మసంబంధమైన జ్ఞానం గలవార్కి తెలుస్తుంది. గాని, అక్షరానుసారులకు తెలియదు. తెలిసేరోజు వచ్చేసరికి చాలా అయ్యిపోతాయి. స్వంత ఆలోచనలు, స్వార్ధపు బుద్దులు, పిలుపులేని సేవా పరిస్థితులు మనుష్యుల దయను, మనుష్యుల మెప్పును, మనుష్యులను సంతోషపరచాలనుకుని సేవ చేసేవారు మెస్సీయకు దాసులు కారు. కాలేరని గలతీ 1:10వ వచనం ఋజువు చేస్తుంది.

పరమతండ్రి మనుష్యుల మెప్పును (యోహాను 5:34,41,44) కోరలేదు. మనుష్యుల సాక్ష్యంతో (యోహాను 2:24,25) ఆయన సంతృప్తిపడలేదు. పదిమందికి ఇష్టమైనది ఆయన చేయలేదు గాని పరమతండ్రికి ఇష్టమైనదే ఆయన చేసాడు. నిజమైన ఆయన సేవకులు కూడా చేయవలసింది అదే: అది మనుష్యులకు ప్రతికూలం అవ్వవచ్చు కాని పరమతండ్రికి అనుకూలమైతే సరిపోతుంది.

15 సంవత్సరాల క్రిందట ఒక వ్యక్తి నాకు తరుచుగా లెటర్స్ వ్రాస్తూ చాలా నీచాతినీచంగా నన్ను విమర్శిస్తూ ఉండేవాడు. అతని విమర్శలను వింటూ చాలా వరకు నన్ను నేను కరెక్టు చేసుకున్నాను. **ఎందుకంటే మనల్ని ప్రేమిస్తున్నామని చెప్తున్న వారికన్నా, మనల్ని ద్వేషించే వారే మనలోని లోపములను ఎత్తి చూపగలరు. అది మానవనైజం గనుక మన తప్పులు మనకి వెనువెంటనే తెలియాలి అంటే మనల్ని విమర్శించే వారు మనకి చాలా అవసరం. చాలామంది మనుష్యులు ముఖము ఎదుట ముఖస్తుతి చేసి ముఖము వెనుక తప్పులను గూర్చి మాట్లాడుతూ ఉంటారు, లేక మూడవ వ్యక్తి దగ్గర మన గురించి చెపుతూ ఉంటారు. అది మనం గమనించినట్లయితే, తద్వారా కూడా మన తప్పులను మనం తెలుసుకోగలం.** అందుకే అతని విమర్శలన్నీ నేను విని నన్ను నేను సరిచేసుకొని అతనిని జయించాను. మంచిబలం పొందుకున్నాను. కొంతకాలమైన తర్వాత అతను **"కోడిగుడ్డుకి ఈకలు లాగడం"** లాంటి విమర్శలు మొదలుపెట్టాడు. అప్పుడు నేను అతడ్ని చట్రంలో పెట్టి జవాబు కోరాను.

నీవు విశ్వాసివా? లేక బోధకుడివా? అని అడిగాను. నీవు విశ్వాసివి అయితే ఏ సంఘసభ్యుడవు? నీ బోధకుడు ఎవరు? నీ సహవాసం ఎక్కడ? కాదు నీవు బోధకుడివైతే నీది ఏ సంఘం? ఎక్కడ కూడుకుంటారు? చెప్పు తేల్చుకుందాం అన్నాను. కాని పాపం అయ్యగారు, ఈయన విశ్వాసికాదట, బోధకుడూ కాదట: మరి నీవు ఎవరవు అని అడిగితే సమాధానం లేదు. **ఇతను విశ్వాసిగా ఒక బోధకుని క్రింద ఉండలేదు, బోధకునిగా ఒక సంఘమును కట్టలేదు. గాలికి కదులుచున్న రెల్లువంటి వీరి వలన కూడ ప్రతీచోట సమస్యలే.**

**-మిగతా 3వ పేజీలో**

# సంపాదకీయం

సత్యమునకై పోరాటం పత్రిక చదువరులకు షలోమ్ ! సహో. యదీద్యా, సహో. సమాధానరాజు (కాకినాడ) గార్లు నాకు ఈ క్రింది పత్రిక, లెటరు పంపించి సమాధానము కోరియున్నారు. కావున వారి కోరిక మేరకు నా సమాధానమును పంపించుచున్నాను. క్రింది భాగములో చూడండి.

షలోమ్ షలోమ్

సున్నతి నిత్యనిబంధన ఆది. 17:7

**CIRCUMCISED** Gen. 17:7

**మీ పండుగ పేరేమి?**

| సృష్టికర్త యవే నియమించిన పెసెల్ Passover పస్కాపండుగ | లేక | మానవులైన క్రైస్తవులు నియమించిన గుడ్‌ఫ్రైడే Good Friday పండుగ? |
|---|---|---|

- ⋆ షీమోత్, Exo. నిర్గమ 12:43-45,48,49 ప్రకారం సున్నతి పొందిన అన్యుడు, పరదేశే పస్కా ఆచరించవలెను. సున్నతి లేనిదే పస్కా ఆచరించతగదని యవే మోషే, అహరోన్‌లకు సెలవిచ్చెను.
- ⋆ యహూషువ Yahoshua 5:2-10 పస్కా పండుగకు ముందే యిశ్రాఏల్ సంతతి వారికి సున్నతి చేయించమని యవే యహూషువకు ఆజ్ఞాపించెను.
- ⋆ Gen. ఆది 17:8, Exo నిర్గమ 2:24 కనాను దేశమును నిత్య స్వాస్థ్యముగా ఇచ్చుటకు అబ్రాహమ్, యిట్స్‌ఖాఖ్,యఖ్‌బ్‌లతో చేసిన నిత్యనిబంధనే సున్నతి.
- ⋆ Exo నిర్గమ 12:48 సున్నతి పొందనివాడు యిశ్రాఏల్ దేశములో పుట్టినవానితో సమముడగును.
- ⋆ Gen. ఆది 17:14 సున్నతి పొందనవాడు తన జనులలో నుండి కొట్టి వేయబడును. సున్నతి పొందనివాడు యవే నిబంధన మీరియున్నాడు.
- ⋆ నిత్యనిబంధనయైన విశ్రాంతి దినము, మరియు నెలపొడుపులు, పండుగలు ఆచరించే యిశ్రాఏల్ 12 గోత్రకర్తల శరీరమందు యవే నిత్యనిబంధనయైన సున్నతి అను గురుతు పొందియున్నారు.
- ⋆ సహోదరులారా యిశ్రాఏల్ సంతతివలే మీరును అవే నియామక కాలములు (పరిశుద్ధ కూడికలు) ఆచరించే అర్హత పొందాలంటే యవే సున్నతి అను గురుతు మీ శరీరమందు పొందియున్నారా?
- ⋆ నా అభిప్రాయం : మీరు ఆచరించేది యవే పస్కా పండుగే అయితే సున్నతి అవసరం.
- ⋆ క్రైస్తవుల గుడ్ ఫ్రైడే అయితే సున్నతి అవసరం లేదు.

Tanach తెనాహ్ - పాత నిబంధన మూడు భాగములు

1. తోరా - ధర్మశాస్త్రము - 5 కాండములు
2. నెవిమ్ - ప్రవక్తలు - 21 విభాగములు
3. కెతూబిమ్ - రచనలు - 13 పుస్తకములు

పై మూడు భాగములు నుండి అనగా ధర్మశాస్త్రము, ప్రవక్తల వచనములు (పాతనిబంధన) నుండి యవే పస్కా పండుగ ఆచరించే వారికి సున్నతి అవసరం లేదని ఎవరైనా నిరూపిస్తే రూ. 7,000/-లు ఇవ్వడానికి నేను సిద్ధం నిరూపించలేకపోతే మీరు సిద్ధమేనా?

- ⋆ ఎలోహీంను గూర్చిన జ్ఞానం ఈ విషయమై కొందరికి లేదు, మీకు సిగ్గు కలుగుటకై ఇట్లు వ్రాయుచున్నాను.
- ⋆ పౌరుషం గలవారై యున్నారో లేదో మిమ్మును మీరే పరీక్షించుకోండి.
- ⋆ ఎన్నాళ్ళు రెండు తలంపులు మధ్య తడబడుచుందురు రండి మన వివాదం తీర్చుకొందము.
- ⋆ ఈ ఆలోచనయైనను ఈ కార్యమైనను మనుషుల వలన కలిగినదాయేనా అది వ్యర్థం.ఎలోహీం వలనకలిగినదాయేనా మీరు వ్యర్థపరచలేరు. మీరొకవేళ ఎలోహీంతో పోరాడువారవుదురు సుమీ!
- ⋆ యరుషాలీమ్ యొక్క క్షేమం కొరకు ప్రార్థన చేయండి. కీర్తన 122 :6

మషీఅఖ్ నామములో

మీ సహోదరుడు, **యదీద్యా YADIDIYAH** (ఎలోహీం బానిస)

పాయకరావుపేట, విశాఖ జిల్లా. సెల్ : 9290007217

షలోమ్ షలోమ్

కిప్పా (టోపీ) నెత్తిపైన పెట్టుకుంటే సరిపోదు క్రింద దానికి సున్నతి కావాలి. ఆ రెండూ ఉంటేనే సబ్బాతు, నెలపొడుపులు, పండుగలు ఆచరించడానికి అర్హత ఉంటాది. ఇది సృష్టికర్త నీకు, నాకు ఇచ్చే హెచ్చరిక. కళ్ళు తెరచుకొని బయటకు రండి. ఇట్లు యావే నామములో మీ ప్రేమపూర్వక సహోదరుడు, పస్కా పీసా, పీస్కా శుభాకాంక్షలు.

సమాధాన రాజు, రేచర్లపేట, కాకినాడ. ఫోన్ నెం. 98669 52967

---

సున్నతి సహోదరులకు ప్రేమతో బ్రదర్ ఐజక్ వ్రాయునది. మీ పత్రిక లెటరు చదివాం.

**అన్యజనులకు సున్నతి అవసరం లేదని క్రొత్తనిబంధన రూఢిగా తెలియపర్చుచున్నది.అ.కార్య. 15:1-34.**

పాతనిబంధన ప్రకారంగా సున్నతి అనునది యూదునికి, అన్యునికి కూడా అవసరమే. ఆ విషయములు మాకు బాగుగా తెలుసు. మీరు ధర్మశాస్త్రము-ప్రవక్తల వచనములను మాత్రమే నమ్ముదురని తెలియపర్చిరి. మేమైతే ఆదికాండం నుండి ప్రకటన గ్రంథం ఆఖరు వరకు యావె ఆత్మ ప్రేరేపణ వలన వ్రాయబడిన వాక్యములని నమ్ముచున్నాము. 2 పేతురు 1:20,21. 2 తిమోతి 3:14-17. మీరు వ్రాసిన వ్రాతలన్నీ పాత నిబంధనకు సంబంధించినవే గాని క్రొత్త నిబంధన లోనివి కావు. మీరు క్రొత్త నిబంధనను నమ్మరని తెలుస్తుంది. గనుక క్రొత్త నిబంధనలో సున్నతి ఎందుకు అవసరం లేదో వాటికి సంబంధించిన వాక్యములను ఇచ్చట ఇచ్చుచున్నాము. గనుక వీటిని పరిశీలించి మా విశ్వాసము ఏమైయున్నదో మీరే గ్రహించుకొనుడి. రోమా 2:25-29, 3:1,30, 4:9-12, 15:9, 1 కొరింథీ 7:18,19, గలతీ 1:6, 2:2-7-9,12, 5:1,2,6,13, ఫిలిప్పీ 3:2,3, కొలస్సీ 4:11, తీతు 1:10.

క్రొత్త నిబంధనలో లోక రక్షకుడైన యషువ మెస్సీయ, బాప్తీస్మమిచ్చు యోహాను, యూదులైన అపోస్తలులు, అపోస్తలుడైన సౌలు, తిమోతి మొదలగువారు సున్నతిని పొందినవారు. అన్యజనులకు సున్నతి అవసరం లేదని అ॥కార్య 15:1-34 ఋజువు చేయుచున్నది. సున్నతి అన్యజనులకు మోయలేని కాడి, అ॥కార్య 15:10; సున్నతి అన్యజనులకు కష్టతరమైనది. అ॥కార్య 15:19; సున్నతి అన్యజనులకు కలవరమును మనస్సులను చెరుపుటయైయే ఉన్నది. అ॥కార్య 15:24; సున్నతి అన్యజనులకు భిన్నమైన సువార్తయై ఉన్నది, గలతీ 1:6; సున్నతి అన్యజనులకు దాస్యమైన కాడి, గలతీ 5:1; సున్నతి అన్యజనులకు కృప నుండి బొత్తిగా వేరుచేయబడి తొలగింపచేయునది గలతీ 5:2; సున్నతి అన్యజనులను కలవరపరచునది, పులిసిన పిండి, గలతీ 5:8-12; సున్నతి అన్యజనులకు బలవంతము చేయుటలాంటిది మరియు శారీరక ఉప్పొంగు, గలతీ 6:12,13; అన్యజనుడైన (గ్రీసు దేశస్థుడైన) తీతు సున్నతి పొందుటకు బలవంత పెట్టబడలేదు గలతీ 2:3. అన్యజనులకు సున్నతి అనునది కపట సహోదరుల బోధయై యున్నది గలతీ 2:4; అన్యజనులకు సున్నతి బోధించువారు అవిధేయులను, వదరబోతులును, మోసపుచ్చువారునై యున్నారు. కుటుంబములను కుటుంబములను పాడుచేయువారునై యున్నారు, తీతు 1:10-12, సున్నతి సంబంధులను గూర్చి ఈ కఠినమైన వాక్యం కూడా చదవండి, ఫిలిప్పీ 3:2-4; సున్నతి పొందనివారికి సువార్త బోధించు అధికారం అపోస్తలులైన సౌలుకు కలదు, గలతీ 2:9. అపొస్తలుల కాలములో సున్నతి పొందినవారు - సున్నతి పొందనవారు కలిసే ఉన్నారు. **గనుక క్రొత్త నిబంధన ప్రకారం అన్యజనులు తప్పనిసరిగా సున్నతి పొందాలి అని మీరు వాక్యం ద్వారా చూపించగలిగితే నేను రూ. 10,000/-లు (అక్షరాల పదివేల రూపాయలు) ఇవ్వగలను. ప్రేమతో మిమ్మును వాక్యం ద్వారా ఋజువు పరచమని కోరుచున్నాను.**

యషువ మెస్సీయ సేవలో బ్రదర్. ఐజక్ ఇ. కుసుమ

---

**(2వ పేజీ తరువాయి)** బోధకునికిగా ఒక సంఘాన్ని నడిపించలేడు. బైబిల్లో కొన్ని వాక్యాలు వాళ్ళ దగ్గర, వీళ్ళ దగ్గర, కాపీ కొట్టి, వాళ్ల లూప్‌హోల్స్, వీళ్ళ లూప్‌హోల్స్ వెతుకుతూ ఈయన గారి అసలు బ్రతుకు మర్చిపోయి పెద్ద బైబిల్ ప్రొఫెసర్‌లా బైబిలు విషయాలు మాట్లాడటం అలవర్చుకున్నాడు. ఇలాంటి వాళ్ళు ప్రపంచంలో చాలామంది ఉన్నారు. విశ్వాసిగా సమాజంలో ఉండరు. బోధకులకు దశమభాగం ఇవ్వరు. పోనీ బోధకులుగా బ్రతకగలరా అంటే బ్రతకలేరు. కాని బోధ చెయ్యడానికి మాత్రం సిద్ధపడిపోతూ ఉంటారు. గట్టిగా అడిగామనుకోండి అందరూ యాజకులే అంటారు. బైబిలు విషయాల్లో తల ఏదో తోక ఏదో తెలియక పోయినా, బోధకుల మధ్య కూర్చుని భోజనాలు చేస్తుంటారు. బోధకుల స్థానం ఆక్రమిస్తూ ఉంటారు. బోధకులనే విమర్శిస్తూ ఉంటారు. సత్యమేదో అసత్యమేదో తెలియకపోయినా బోధలు మాత్రం చేస్తూ ఉంటారు. వీరంతా క్రమమెరుగని అక్రమస్తులు. అందువలన ఈ సమస్యలు.

కుష్ఠురోగంతో పరమతండ్రి ఇట్టివారిని మొత్తేవరకూ పుల్‌పిట్ ఎక్కడం మానరు. బోధలు చేయడం మానరు. అది అతి త్వరలోనే చాలామందికి జరగనుంది. అంతవరకూ వేచి చూడండి.

మా తండ్రి అంటూ ఉండేవారు., ఇంకెంతకాలం 2 సం॥రాలు రిటైర్ అయ్యిపోయిన వెంటనే సేవకి వచ్చేస్తాను అని. అది మీ పని కాదు అన్నాను. వి.ఆర్.ఎస్. ఇచ్చి వస్తాను అంటున్నారు ఈనాడు చాలామంది. తప్పు, అది మీ పని కాదు. ప్రతి పైసాకి ఆయన మీద ఆధారపడి సేవ చేయాలి. అది ఉద్యోగస్తుల వలనగాని, వి.ఆర్.ఎస్. ఇచ్చి వచ్చేవారివలన గానీ, లేక రిటైర్ అయ్యి వచ్చేవారి వలన గాని జరగని పని, అందుకే పరమతండ్రి వారిని పిలవడు. యవ్వనకాలంలో (వి॥వాక్య 3:27,28) ఉన్నవారిని తండ్రి పిలుస్తాడు. సమస్తమూ వదిలి (లూకా 18:28) ఆయనను వెంబడించాలి. ప్రతీ లేఖనమును సరిగా ఉపదేశించి బోధింప సమర్థుడై ఉండాలి (2 తిమోతి 3: 16,17).

ఖచ్చితంగా బైబిల్లో ఉన్నది ఉన్నట్లుగా చెప్పాలంటే ఎఫెసీ 4:13 ప్రకారం **(అపోస్తలులు, ప్రవక్తలు, సువార్తకులు, కాపరులు, ఉపదేశకులు)** వారు మాత్రమే సువార్త చెయ్యాలి. మిగతా వారెవరూ పుల్‌ఫిట్ ఎక్కకూడదు. సొమ్ములు విశ్వాసులు నుండి వసూలు చేయకూడదు. కాపరి లేని విశ్వాసులకు కాపరుల్లా వేషం వేసి వరిని మోసగించకూడదు. కాపరి యొక్క ఆవశ్యకత విశ్వాసులకు తెలియాలి. వారి వారి కాపరులను విశ్వాసులు పోషించుకునే స్థితికి ఎదగాలి. కాపరులను నియమించకుండా సంఘాలను నడిపే దొంగ కాపరులున్నంత కాలము విశ్వాసికి క్రమము అంటూ తెలియదు. ఎవరు బడితే వారు సంఘాలను నడిపించకూడదు. చూడండి పాత నిబంధన కాలంలో పరమతండ్రి లేవీయులను ఏర్పాటు చేస్తే సాతాను కొంతమంది డూప్లికేట్‌లను ఏర్పరచి వారి ద్వారా పరమతండ్రి నియమాన్ని దెబ్బతీయుటకు ప్రయత్నించింది. ఆ ప్రయత్నంలోనే యరోబాము మొదలగు వారు పరమతండ్రి ఆలయమునకు వ్యతిరేకంగా ఆలయములు నిర్మించి ప్రజలను సత్యము తెల్సుకోకుండా అడ్డుబండలుగా జీవించారు.

గనుక విశ్వాసులారా ఎవరు పరమతండ్రి ద్వారా ఏర్పాటు చేయబడినవారో, ఎవరు స్వంత ఉద్దేశ్యాలతో సేవ చేయుచున్నారో మీరే గమనించి తండ్రి యొక్క చిత్తమును తెలుసుకొనండి. పరమతండ్రి ద్వారా ఏర్పాటు చేయబడినవారు, మనుష్యుల మెప్పును కోరరు, మనుష్యులను సంతోషపరచలేరు, గలతీ 1:10.

**యాజకుడు ధర్మశాస్త్రమును వినిపించకమానడు**

**జ్ఞాని యోచన లేకుండా నుండడు**

**ప్రవక్త వాక్యము చెప్పక మానడు. యిర్మీయా 18:18**

# ధర్మశాస్త్రమును గూర్చి నీకు తెలిసినదెంత?

**- బ్రదర్ పి. ఆమెన్ రాజు, పాడేరు.**

బైబిల్లో అనేకమందికి అర్థం కానిది, అర్థం చేసుకోలేనిది ఏమంటే ధర్మశాస్త్రము, అనేక చోట్ల ధర్మశాస్త్రం కొట్టివేయబడిందని క్లీర్‌గా వ్రాయబడి ఉంది గదా ! అంతే దానిని అలుసుగా తీసుకొని బోధకులు రకరకాలుగా తర్జుమా/వ్యాఖ్యానాలు చేసి మాట్లాడుతున్నారు. యూదులలో ఆనాదు అనేక తెగల వాళ్ళు ఉన్నారు. ముందుగా మెస్సీయ మాటలు చూద్దాం / అలాగే అపోస్తులుల మాటలు కూడా చూద్దాం.

**1. మత్తయి : 5:17,18 : ధర్మశాస్త్రమునైనను ప్రవక్తల వచనములైనను కొట్టివేయవచ్చితినని తలంచవద్దు. నెరవేర్చుటకే గాని కొట్టివేయుటకు నేను రాలేదు. ఆకాశమును భూమియు గతించిపోయిననే గాని ధర్మశాస్త్రమంతయు నెరవేరు వరకు దాని నుండి ఒక పొల్లయినను ఒక సున్నయైనను తప్పిపోదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నారు.**

**2. రోమా 3:20 :** ధర్మశాస్త్రమే లేకపోతే పాపమనగా ఎట్టిదో తెలియదు.

**3. రోమా 4:15 :** ధర్మశాస్త్రము లేనియెడల అతిక్రమము లేకపోవును.

**4. రోమా 5:13 :** ధర్మశాస్త్రము లేనప్పుడు పాపము ఆరోపింపబడదు.

**5. రోమా 7:8 :** ధర్మశాస్త్రము లేనప్పుడు పాపము మృతము.

**6. రోమా 7:7 :** ధర్మశాస్త్రము వలననే గాని పాపము అనగా ఎట్టిదో నాకు తెలియకపోవును. ఆశింపవద్దని ధర్మశాస్త్రము చెప్పని యెడల దురాశయన ఎట్టిదో నాకు తెలియకపోవును.

**7. లేవీయ 18:1-23 :** ధర్మశాస్త్రమే లేకపోతే అక్క-చెల్లి, అన్న,తమ్ముడు, తల్లి, తండ్రి మొదలగు బాంధవ్యాలే ఉండవు. మనుష్యులు బ్రతికినంతకాలము ధర్మశాస్త్రము ఉందని రోమా 7:1-3, చెపుతుంది.

- ఈనాడు బోధకులంతా అది తప్పు, ఇది ఒప్పు అది పాపం, ఇది పాపం కాదు, మొదలైన మాటలు / బోధ చేస్తున్నారంటే దానికి గల ఆధారం ధర్మశాస్త్రమే. కాదని ఎవ్వరూ చెప్పలేరు. అయితే ఈ ధర్మశాస్త్రం కొట్టివేయబడిందని గాని / ధర్మశాస్త్ర ప్రకారము నడవవలసింది లేదని గాని ఎందుకు వ్రాయబడినది అనునది మన ప్రశ్న. యూదులలో ఉన్న తెగలలో రకరకాల అభిప్రాయాలు కలిగిన వారున్నారు. వారికి రకరకాల సిద్ధాంతాలు ఉన్నాయి. బోధకులైన మీరు 1. కొరింథీ 9:7-10 ప్రకారం తీసుకునే కానుకలు / దశమ భాగం ధర్మశాస్త్ర పరమైనదికాదని చెప్పగలరా? డబ్బు తీసుకునే దగ్గర మీకు ధర్మశాస్త్రం కావాలి. పాపాన్ని గూర్చి బోధించాలంటే ధర్మశాస్త్రం కావాలి. వయస్సు/వరుసల దగ్గర ధర్మశాస్త్రం కావాలి. అసలు ధర్మశాస్త్రం లేకుండా ఏముంది? ఎందుకు మీరు ధర్మశాస్త్రాన్ని అర్థం చేసుకోకుండా బోధకులుగా వచ్చారు? ఇపుడు చెప్పండి ధర్మశాస్త్రం ఉందా? లేదా? **సామెతలు 28:9 ధర్మశాస్త్రము వినబడకుండా చెవిని తొలగించుకొనువాని ప్రార్థన హేయము. కీర్తనలు 1:2 యావె ధర్మశాస్త్రము నందు ఆనందించుచు దివారాత్రము దానిని ధ్యానించువాడు ధన్యుడు.**

# బైబిలు క్యాలండరు : బైబిలు పండుగలు

ప్రియ సహోదరుడా ! సహోదరి !

పరిశుద్ధ లేఖనముల పరంగా ప్రపంచానికి సూర్యుడు ఒక్కడే, చంద్రుడు ఒక్కడే. వాటివలననే సూచనలు, కాలములు, దినములు, వారములు, నెలలు, సంవత్సరములు లెక్కించబడుచున్నవి (ఆది. 1:14:16).రోజుకి 24 గంటలు (యోహాను 11:9). వారమునకు 7 దినములు (1 రాజులు 8:65) నెలకు 29:5 దినములు (ఆది 8:3). సంవత్సరమునకు 12 నెలలు (1 దినవృ 27:1–15). ఆదివారము వారమునకు మొదటి దినమనియు, విశ్రాంతిదినము శనివారము వారమునకు ఆఖరి దినమనియు (మత్తయి 28:1), బైబిలు మనకు బోధించుచున్నది. పరిశుద్ధ గ్రంథము మాత్రమే సూర్యుని, చంద్రుని అనుసరించి అవి సూచనలను, కాలములను, దినములను, సంవత్సరములను సూచించునని తెలియపర్చు చున్నది (ఆది 1:14).ఆదికాండములోనే మనము 7 దినములను చూడగలము (ఆది 1:5,8,13,19, 23,31, 2:1–3). మానవునికి ఏదైతే అవసరమో దానిని పరమతండ్రి తన పరిశుద్ధ గ్రంథమునందు లిఖించి పెట్టించెను. గనుక క్యాలెండరు ఆధారము బైబిలు గ్రంథము మాత్రమే. ఒక దినము సూర్యాస్తమయముతో ప్రారంభమై మరుసటి సూర్యాస్తమయమునకు అంతమవును (లేవీ 23:32, నెహెమ్యా 13:19, యెహాను 19:31, లూకా 23:54).

– నెలలో ఈ నెల మీకు మొదటిది ఇది మీ సంవత్సరమునకు మొదటి నెల............. నిర్గమ 12:2
– నీసాను మాసమున అనగా ప్రథమ మాసమున ........................................... ఎస్తేరు 3:7
– అబీబు నెలను ఆచరించి నీ ఎలోహీం అయిన యావెకు పస్కాపండుగ జరిగింపవలెను.....ద్వితీ16:1
– సంవత్సరమును దయాకిరీటము ధరింపజేసియున్నావు................................ కీర్తనలు 65:11
– నీ ఎలోహీం అయిన యావె యొక్క కన్నులు సంవత్సరాది (నీసాను/అబీబు 1నుండి) మొదలుకొని సంవత్సరము (ఆదారు 29 వరకు) ఎల్లప్పుడు దాని మీద ఉండును........................ ద్వితీ 11:12
–నెలపొడుపు ద్వారా నెల ఆరంభమగుచున్నది ........................................ సంఖ్యా 10:10,28:11.

**ఇప్పుడు బైబిలులో ఉన్న 12 నెలలను పరిశీలిద్దాం !**

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1వ నెల | నీసాను/అబీబు | 30 రోజులు | ఎస్తేరు 3:7 | చైత్రము | మార్చి–ఏప్రిల్ |
| 2వ నెల | జీఫ్ | 29 రోజులు | 1రాజులు 6:1 | వైశాఖము | ఏప్రిల్–మే |
| 3వ నెల | సివాన్ | 30 రోజులు | ఎస్తేరు 8:9 | జ్యేష్ఠము | మే–జూన్ |
| 4వ నెల | తమ్మూజు | 29 రోజులు | జెకర్యా 8:19 | ఆషాడము | జూన్–జూలై |
| 5వ నెల | అబ్ | 30 రోజులు | యిర్మి 52:12 | శ్రావణము | జూలై–ఆగష్టు |
| 6వ నెల | ఏలూలు | 29 రోజులు | నెహె 6:15 | భాద్రపదము | ఆగష్టు–సెప్టెంబర్ |
| 7వ నెల | ఏతనీమ్ | 30 రోజులు | 1రాజులు 8:2 | అశ్వయుజము | సెప్టెంబర్–అక్టోబర్ |
| 8వ నెల | బూల్ | 29 రోజులు | 1రాజులు 8:2 | కార్తీకము | అక్టోబరు–నవంబర్ |
| 9వ నెల | కిస్లేపు | 30 రోజులు | నెహె 1:1 | మార్గశిరం | నవంబర్–డిసెంబర్ |
| 10వ నెల | టెబెత్ | 29 రోజులు | ఎస్తేరు 2:16 | పుష్యం | డిసెంబర్–జనవరి |
| 11వ నెల | శెబాటు | 30 రోజులు | జెకర్యా 1:7 | మాఘం | జనవరి–ఫిబ్రవరి |
| 12వ నెల | ఆదారు | 29 రోజులు | ఎస్తేరు 3:7,13 | ఫాల్గుణం | ఫిబ్రవరి–మార్చి |

**ఇప్పుడు బైబిలులో ఉన్న పండుగలను పరిశీలిద్దాం ! (లేవీ 23వ అధ్యాయము)**

| | | | |
|---|---|---|---|
| 1. పస్కా పండుగ | లేవీ 23:5 | నీసాను 14 | లూకా 2:40–42, అ॥కార్య 12:4 |
| 2. పులియనిరొట్టెల పండుగ | లేవీ 23:6–8 | నీసాను 15–21 | అ॥కార్య 12:3, 20:6,1 కొరి 5:7–8 |
| 3. వారముల పండుగ | లేవీ 23:15,16 | సీవాన్ | అ॥కార్య 2:1, 20:16, 1 కొరి 16:9 |
| 4. జ్ఞాపకార్థ శృంగధ్వని పండుగ | లేవీ 23:24,25 | ఏతనీము 1 | |
| 5. పాపప్రాయశ్చిత్తార్థ దినము | లేవీ23:27–32 | ఏతనీము 10 | అ॥కార్య 27:9 |
| 6. పర్ణశాలల పండుగ | లేవీ 23:34–44 | ఏతనీము 15–21 | యోహాను 7:2–14, అ॥కార్య 18:21 |
| 7. అంత్యమహాదినము | లేవీ 23:36 | ఏతనీము 22 | యోహాను 7:37 |

పస్కా పశువునకు సాదృశ్యమైన యషువ మెస్సీయ బైబిలు మొదటి నెల అయిన నీసాను/అబీబు 14వ తేదీన చనిపోయాడు. ఇక్కడ నుండి 6 నెలలు క్రిందికి వెళ్ళితే అదే ఆయన జననం. **అది బైబిలు నెలల ప్రకారం ఏతనీమనే ఏడవ నెల 15వ తేది పౌర్ణమి.అదే పర్ణశాలల పండుగ మొదటిదినం. ఆ రోజే మెస్సీయ జన్మదినం.** ఎందుకంటే యషువ మెస్సీయ ఈ భూలోకంలో 33 1/2 సం॥రములు జీవించియుండెను. రమారమి 30 సం॥ల వయస్సులో ఆయన బాప్తిస్మము పొంది బోధింపనారంభించెను. లూకా 3:23. మూడున్నర సం॥లు ఆయన బోధించెను. గనుక ఆయన జననమునకును, మరణమునకును వ్యత్యాసము 6 నెలలు ఉండవలసి యున్నది. అది కేవలం బైబిలు క్యాలండరు నుండి మాత్రమే మనకు సరిపోవును.

**ఆయన జననం BC 04 పర్ణశాలల పండుగ దినములు........................... 7వ నెల ఏతనీము 15వ తేదీ**
**ఆయన మరణం AD 31 పస్కా పులియని రొట్టెల పండుగ దినములు................ 1వ నెల నీసాను 14వ తేదీ**

| | | | |
|---|---|---|---|
| 1వ నెల | నీసాను/అబీబు | ఎస్తేరు 3:7 | 14 మరణం |
| 2వ నెల | జీఫ్ | 1 రాజులు 6:1 | / |
| 3వ నెల | సీవాను | ఎస్తేరు 8:9 | |
| 4వ నెల | తమ్మూజు | జెకర్యా 8:29 | 6 నెలల గ్యాప్ |
| 5వ నెల | అవ్ | యిర్మీయా 52:12 | / |
| 6వ నెల | ఏలూలు | నెహెమ్యా 6:15 | |
| 7వ నెల | ఏతనీము | 1రాజులు 8:2 | 15 జననము |

అనేకమంది బోధకులు చెపుతున్నట్టుగా డిసెంబర్ 25న మెస్సీయ పుట్టి ఉంటే, ఆయన మరణం 6 నెలల తరువాత అయిన జూన్ 25న అయ్యిఉండాలి. అంటే ప్రతీ సం॥ము జూన్ 25న గుడ్‌ఫ్రైడే రావలసియున్నది.

1. డిశెంబరు 25 నుండి జనవరి 25కు .................. 1 నెల
2. జనవరి 25 నుండి ఫిబ్రవరి 25కు .................... 2 నెలలు
3. ఫిబ్రవరి 25 నుండి మార్చి 25 కు .................... 3 నెలలు
4. మార్చి 25 నుండి ఏప్రిల్ 25 కు ...................... 5 నెలలు
5. ఏప్రిల్ 25 నుండి మే 25 కు ........................... 5 నెలలు
6. మే 25 నుండి జూన్ 25 కు ............................ 6 నెలలు

2000 సం॥ల చరిత్రలో గుడ్‌ఫ్రైడే ఎప్పుడైనా జూన్ 25న వచ్చిన దాఖలాలు కలవా? మిమ్మును మీరే పరిశీలించుకోండి. వాక్యము చెప్పేదానికి ప్రజలు అనుసరించేదానికి అసలు సంబంధమే లేదు.గనుక నేడైనా ఈ సత్య వాక్యములను, బైబిలు క్యాలండరును, బైబిలు పండుగలను గుర్తించి సత్యమును గ్రహించి పరలోకవారసులు కండి.

ఇంకను పూర్తి వివరములకు సంప్రదించండి.

# ఎడిటర్ నోట్ :

పత్రిక ఉచితము కాదు సం॥ర చందా రూ. 50/–లు పంపి పత్రికను సక్రమముగా పొందండి. ఈ పరిచర్య ద్వారా ఎస్.ఎమ్.ఎస్.వర్తమానములు పొందగోరువారు 98493 85038 నకు మీ ఫోన్ నెంబర్లు పంపించండి. ఇ–మెయిల్ ఐడిని **info@aotle-india.org** నకు పంపండి. అటులనే పాతపత్రికలైన తెలుగు, ఇంగ్లీషు కొరకు మన వెబ్‌సైట్‌ను **www.aotle-india.org** దర్శించండి.

**మీ విరోధులందరు ఎదురాడుటకును, కాదనుటకును వీలుకాని వాక్కును జ్ఞానమును నేను మీకు అనుగ్రహింతును – లూకా 21:15**

**మాటలాడుటయందు అతడు అగపరచిన జ్ఞానమును అతనిని ప్రేరేపించిన ఆత్మను వారెదిరింపలేకపోయిరి – అపొ. 6:10**

# ప్రభువుదినము శనివారమా లేక ఆదివారమా?

(క్రీస్తు సంఘ మతశాఖ బోధకుడైన పుస్తకానికి మా జవాబు)

క్రీస్తు సంఘము ఒక మతశాఖ కాదు, మాదే నిజమైన సంఘము అని చెప్పుకోవడాన్కి క్రీస్తు సంఘ మతశాఖ సోదరులు ఈ క్రింది చార్టు ఉపయోగిస్తుంటారు. కాని, వాస్తవానికి వారు ఎంత అబద్ధికులో వారు వ్రాసుకున్న చార్టే వారిని ఋజువు పరుస్తుంది. క్రీస్తు సంఘము AD 33లో పెంతుకొస్తు దినమున స్థాపించబడినదని చెప్పే వారి వాదన ఎంత అబద్ధమో మీరే గ్రహించండి.యషువ మెస్సీయ జననము BC 04 పర్ణశాలల పండుగ దినములు, యషువ మెస్సీయ మరణం AD 31 పస్కా పులియని రొట్టెల పండుగ దినములు, ఆయన ఈ భూలోకమందు 33 1/2 సం॥లు జీవించారు. గనుక ఆయన మరణ సం॥ము AD 31 అవుతుంది గాని 33 అవ్వదు. గనుక అది ఒక అబద్దము. ఇప్పుడు వీరి చార్టు పరిశీలించండి.

| వ.నె. | సమయము | దేశము | స్థాపకుడు | సంఘం పేరు |
|---|---|---|---|---|
| 1. | క్రీ.శ. 33 | యెరూషలేము | యేసుక్రీస్తు | క్రీస్తు సంఘము |
| 2. | క్రీ.శ. 606 | రోము | బోనిఫేస్ 3 | రోమన్ కేథోలిక్ |
| 3. | క్రీ.శ. 1520 | జర్మని | మార్టిన్ లూథర్ | లూథరన్ సంఘము |
| 4. | క్రీ.శ. 1534 | ఇంగ్లాండ్ | హెన్రీ 8 | ఎపిస్‌కోపాలియన్ |
| 5. | క్రీ.శ. 1536 | స్విట్జర్లాండ్ | జాన్ కాల్విన్ | ప్రెస్బిటేరియన్ |
| 6. | క్రీ.శ. 1550 | ఇంగ్లాండ్ | రాబర్టు బ్రోవ్‌నీ | కాంగ్రిగేషనల్ |
| 7. | క్రీ.శ. 1607 | హాలెండ్ | జాన్ స్మిత్ | బాప్టిస్టు |
| 8. | క్రీ.శ. 1739 | ఇంగ్లాండ్ | జాన్‌వెస్లీ | మెథడిస్టు |
| 9. | క్రీ.శ. 1826 | ఇంగ్లాండ్ | జాన్‌వైన్‌బ్రేసర్ | చర్చ్ ఆఫ్ గాడ్ |
| 10. | క్రీ.శ. 1830 | అమెరికా | జోసెఫ్ స్మిత్ | Later Day Saints (Mormon) |
| 11. | క్రీ.శ. 1830 | అమెరికా | విలియమ్ మిల్లర్ | Adventist |
| 12. | క్రీ.శ. 1844 | | ఎలెన్ జి.వైట్ | సెవెంత్‌డే ఎడ్వన్‌టిస్ట్ |
| 13. | క్రీ.శ.1866 | అమెరికా | మేరి బేకర్ ఎడ్డీ | క్రిస్టియన్ సైన్‌టిస్ట్ |
| 14. | క్రీ.శ. 1872 | అమెరికా | చార్లెస్‌రస్సెల్ | జెహోవా విట్‌నెస్ (సాక్షులు) |
| 15. | క్రీ.శ. 1878 | | విలియమ్స్ బూత్ | సాల్వేషన్ ఆర్మీ |
| 16. | క్రీ.శ. 1900 | అమెరికా | చార్లెస్ స్కాట్ | పెంతుకొస్తు |
| 17. | క్రీ.శ. 1938 | ఇండియా (రాజమండ్రి) | ఎం. దేవదాసు గారు | బైబిలు మిషను |
| 18. | క్రీ.శ. 1957 | | యువాన్జికల్ మరియు రిఫార్మ్‌డ్ చర్చి గ్రూపు | యునైటెడ్ చర్చి ఆఫ్ క్రైస్ట్ |
| 19. | క్రీ.శ. 1829 | జర్మనీ | | ప్లెమౌత్ బ్రదరన్ |
| 20. | క్రీ.శ. 1926 | ఇండియా | | గోదావరి డెల్టా మిషన్ (GDM) |
| 21. | క్రీ.శ. 1947 | ఇండియా | కొన్నిసంఘములు కలిసి ఏర్పడినవి | (CSI) దక్షిణ ఇండియా సంఘం |
| 22. | క్రీ.శ. 1525 | | మెన్నోసైమన్ | మెన్నోనైట్స్ |
| 23. | క్రీ.శ. 1933 | ఇండియా (మద్రాసు) | ఒక గ్రూపు | పెంతుకోస్తు |
| 24. | క్రీ.శ. 1938 | ఇండియా (హైదరాబాద్) | భక్తసింగ్ | భక్తసింఘ ఫెలోషిప్ (హెబ్రోను) |
| 25. | క్రీ.శ.1938 | ఇండియా (మద్రాసు) | డి.జి.యస్.దినకరన్ | ఏసు పిలుచుచున్నాడు (Jesus Calls) |
| 26. | క్రీ.శ. 1938 | టెక్సాస్ | డగ్లస్ | W.M.E. |
| 27. | క్రీ.శ. 1938 | ఇండియా | పి.యల్. పరంజ్యోతి | మన్నా పెంతుకోస్తు |
| 28. | క్రీ.శ. 1938 | ఇండియా (విజయవాడ) | పి.యం. సామ్యూల్ | ఇండియన్ పెంతుకోస్తల్ చర్చ్ ఐ.పి.సి. (I.P.C) |
| 29. | క్రీ.శ. 1938 | ఇండియా | జాషువా డానియేల్ | లెమెన్ ఫెలోషిప్ (L.E.F) |
| 30. | క్రీ.శ. 1938 | అమెరికా | బిషప్ మైక్ మోరిమేన్ | అపోస్తలిక్ ఏసునామ సంఘం |
| 31. | క్రీ.శ. 1800 | | కొన్ని సంఘములు | డిసైపిల్స్ ఆఫ్ క్రైస్ట్ |
| 32. | క్రీ.శ. 1914 | | పలు పెంతుకోస్తు సంఘాలు కలిసి ఏర్పడినవి | అసెంబ్లీస్ ఆఫ్ క్రైస్ట్ |
| 33. | క్రీ.శ. 1907–08 | | పలు ఇండిపెండెంట్ సంఘాలు కలిసి ఏర్పడినవి | చర్చి ఆఫ్ ది నజరేన్ |

(ఒకే ఒక నిజ సంఘము **ద లాంబ్ పబ్లికేషన్స్** అనే బుక్‌పేజీ నెం. 34 నుండి సేకరించబడినది)

ఇక వీరు చెప్పే ఇతర అబద్ధ బోధలలో మతశాఖలు AD 606 నుండి ప్రారంభమైనవని చెపుతారు. కాని అబద్ధబోధకులు అపోస్తలుల కాలం నుండే ఉన్నారు. **"అది అపోస్తలుల కాలంలో అబద్ధ బోధకులు"** అనే వ్యాసం కొరకై వ్రాయండి. AD 50 నుండి 95 వరకూ క్రొత్త నిబంధన పుస్తకములు వ్రాయబడుచూనే ఉన్నవి. అవి ఏ భాషలో వ్రాయబడినవి అని "క్రీస్తుసంఘ" బోధకులను అడిగితే గ్రీకులో వ్రాయబడినవి అని చెప్తున్నారు. (ఇదీ అబద్దమే) పోనీ వీరు చెప్తున్నట్లే గ్రీకులో వ్రాయబడితే, క్రీస్తు సంఘం అనేది గ్రీకు పదం కాదు. గ్రీకులో ఆయన పేరు మీద వీళ్ళ సంఘం పేరు ఉండాలి. గ్రీకులో వీళ్ళ సంఘం పేరేమిటో వారిని అడగండి. వీరు అపోస్తలుల మాదిరిని బోధిస్తున్నామని అంటున్నారు గనుక అపోస్తలులు ఏఏ పండుగలు ఆచరించారో వీరు వాటిని ఆచరించాలి గదా? అపోస్తలులు ఏ రోజున ఆరాధనకు కూడమన్నారో అదేరోజు వీరు ఆరాధనకు కూడాలి గదా? మరి వారి మాదిరిని ఎందుకు వీరు చేయడం లేదు?

ప్రతీ మత శాఖకీ ఒక మానవ హెడ్ ఉన్నట్లే, క్రీస్తు సంఘ మతశాఖకీ ఒక మానవుడు ఉన్నాడు. అతనే అలెగ్జాండర్ క్యాంప్‌బెల్ (1788–1866) ఇతడు AD 1536 స్విట్జర్లాండ్‌లో జాన్ కాల్విన్ ద్వారా స్థాపించబడిన ప్రెస్బిటేరియన్ సంఘస్తుడు ఇతని తండ్రి థామస్ క్యాంప్‌బెల్ ప్రెస్బిటేరియన్ కాపరి. అమెరికా దేశములో "క్రీస్తు సంఘ మతశాఖ" వారిని క్యాంప్‌బెల్లైట్స్ అని కూడా తరచుగా పిలుస్తూ ఉంటారు. ఇతను అదే సంఘంలో ఉంటూ డినామినేషన్ కాని దానిని ఏదో ఒక దానిని ప్రజలకు ప్రవేశపరచాలనే ఉద్దేశ్యముతో "క్రీస్తు సంఘము" అనే మతశాఖను స్థాపించాడు. **"బైబిల్ మాట్లాడిన చోట మేము మాట్లాడతాము. బైబిల్ మౌనము వహించిన చోట మేము మౌనము వహించుతాము"** అనే వివాదము అలెగ్జాండర్ క్యాంప్‌బెల్‌దే. మీకు పూర్తి వివరములు కావలసినచో మీ ఇ–మెయిల్ ఐడి పంపించండి. మొత్తం చరిత్ర అంతా మీకు పంపించగలను. గనుక ఐర్లాండ్‌లో పుట్టి, అమెరికాలో సెటిల్ అయ్యిన అలెగ్జాండర్ క్యాంప్‌బెల్ నుండి మాత్రమే ఈ సంఘము ఆరంభించబడినది. ఇది 1961–65లో ఇండియాకు జె.సి. బెయిలీ అనే దొర ద్వారా వ్యాపించబడినది. కాకినాడలో జె.సి. బెయిలీ పేరు మీద ఒక బిల్డింగ్ కూడా ఉంది. అంతకు ముందు "క్రీస్తు సంఘం" అనే మత శాఖ ఇండియాలో లేదు............................................. సశేషం.

*Printed, Published and Owned by Isaac E. Kusuma and Printed at Ratna Offset,Malikipuram - 533 253, E.G. Dt. and Published at Malikipuram Editor Isaac E. Kusuma* *© All Rights reserved*